క్లుప్తంగా

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

కమలాపూర్ : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంతో పాటు అంబాలలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 కిలోల జీలుగ బస్తాకు పూర్తి ధర రూ.4,276 అని, 50 శాతం సబ్సిడీపై రూ.2,138 అందిస్తున్నట్లు తెలిపారు. జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుతో ఏఈఓల వద్ద టోకెన్లు పొంది జీలుగ విత్తనాలు తీసుకెళ్లాలని ఏఓ సూచించారు.

50వ సారి రక్తదానం చేసిన అశోక్



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు, జాగృతి యువత రాష్ట్ర నాయకుడు అమ్మ అశోక్ బుధవారం 50వ సారి రక్తదానం చేశారు. తొర్రూరు గ్రామానికి చెందిన వొల్లపు శ్రావణ్‌యాదవ్ హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కాలు సర్జరీ చికిత్స పొందుతున్న క్రమంలో రక్తం అవసరం వచ్చింది. దీంతో అశోక్‌ను సంప్రదించగా వెంటనే స్పందించి రక్తదానం చేశారు. అనంతరం పరకాల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ గౌతమ్ చవాన్, ఆర్ఎంఓ బాలకృష్ణ అశోక్‌కు బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్ అందించి అభినందించారు.

ఉద్యమకారుల ఫోరం నియామకం


సదానందం


బాబుమియా


రాజయ్య

ఆత్మకూరు : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా కార్యదర్శిగా ఇర్సడ్ల సదానందం, ఆత్మకూరు మండల అధ్యక్షుడిగా ఎండీ.బాబుమియా, ప్రధాన కార్యదర్శిగా దొంకదువ్వ రాజయ్యను నియమిస్తూ రాష్ట్ర ఫోరం చైర్మన్ చీమ శ్రీనివాస్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామన్నారు. తమ నియామకానికి సహకరించిన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గణేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ నేతలను కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు



ఆత్మకూరు : నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్‌తో పాటు యూత్ కాంగ్రెస్ నాయకులు బుధవారం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ఇన్‌చార్జ్ అశ్విన్ రాథోడ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మనోజ్, టీపీసీసీ అబ్జర్వర్ మక్సూద్ అహ్మద్‌లను కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న రోజుల్లో యువతకు పార్టీలో బంగారు భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చినట్లు వారు తెలిపారు.

బీజేవైఎం నాయకురాలి అరెస్ట్

ఆత్మకూరు : ములుగు జిల్లా రామప్ప, లక్నవరానికి ప్రపంచ సుందరీమణులు వస్తున్నారనే కారణంతో ఆత్మకూరు పోలీసులు బుధవారం బీజేవైఎం మండల అధ్యక్షురాలు వేములపల్లి శ్రీలతను అరెస్టు చేయడం హేయమైన చర్య అని బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పుగళ్ల శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వం ఇష్టాను రీతిగా వ్యవహరిస్తుందని ఆరోపించారు.

వినతిపత్రం అందజేత

ఎల్కతుర్తి : అసైన్డ్ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న పట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక డిప్యూటీ తహసీల్దార్ భద్రునాయక్‌కు దళిత హక్కుల పోరాట సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్ వినతిపత్రం అందించారు. ఎల్కతుర్తి మండల పరిధిలోని దండేపల్లి గ్రామానికి చెందిన సర్వేనంబర్ 439లో గల భూమిని 289 మంది దళిత కుటుంబాలకు 1991లో ప్రభుత్వం భూమిని కేటాయించినట్లు తెలిపారు. ఈ భూమిని గుంటూరుపల్లి గ్రామానికి చెందిన ఓ సామాజిక వర్గం వారు అక్రమంగా 63 ఎకరాల 15గుంటల భూమిని కేవలం 33మంది పేరున ధరణిలో పట్టాపాస్‌పుస్తకాలు పొంది ఆ భూమి నుంచి దళితులను బలవంతంగా వెళ్లగొట్టినట్లు తెలిపారు. ఈ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని, ధరణి పట్టాలను రద్దు చేయాలని వినతిలో కోరారు. అలాగే దళితులకు సొంత భూ హక్కులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి రాజ్‌కుమార్, రాజనర్సు, చంద్రమౌళి పాల్గొన్నారు.

స్టార్ట్..కెమెరా..యాక్షన్

- పల్లెల్లో 'షూటింగ్' సందడి
- ఆహ్లాదకరమైన వాతావరణం
- ఆకర్షణీయంగా పల్లె అందాలు
- జానపద, సినీ గేయాల చిత్రీకరణ
- కేరాఫ్‌గా ధర్మసాగర్ రిజర్వాయర్, చెరువులు


చెరువు గట్టుపై పాట చిత్రీకరిస్తున్న గేయ, రచయిత బృందం


షూటింగ్‌లో పాల్గొన్న కళాకారులు

ధర్మసాగర్ : ఆధునిక యుగంలో పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో ఏదైనా సులువుగా చేసే అవకాశాలను వినియోగించుకుంటూ పలువురు ఉన్నతస్థాయికి ఎదుగుతున్నారు. నేటి యువత ఒకప్పుడు చిత్రీకరణ అంటే ఎక్కడో స్టుడియోలోనో లేక మరెక్కడో తీసేవారు. గతంలో చిత్రీకరణలో ఇప్పుడున్నంత టెక్నాలజీ కూడా అందుబాటులో ఉండేదికాదు. కానీ మారిన కాలానికి అనుగుణంగా టెక్నాలజీని వినియోగించుకుంటూ యువత అనేక రంగాల్లో రాణిస్తున్నారు. ఇప్పుడు ఆ చిత్రీకరణాలు పల్లె వాకిట్లోకి వచ్చాయి. ధర్మసాగర్ మండల కేంద్రంలోని రిజర్వాయర్, పరిసర ప్రాంతాల్లో నిత్యం షూటింగ్‌ల సందడి నెలకొంటోంది. ఇప్పటికే ఇక్కడ చాలా సినీ గేయాలు, జానపద పాటలకు షూటింగులు చేపట్టారు. అలాగే ధర్మసాగర్ పరిసర ప్రాంతమైన ముప్పారం పెద్ద చెరువు, గట్టుపై ఉన్న కాకతీయుల నాటి కట్టడం శ్రీ ముఖ్యనాథ స్వామి ఆలయం, చుట్టూ ఉన్న ఇనుపరాతి గుట్టలు, అందమైన ప్రకృతి, పచ్చని పంట పొలాలు చూపరులను ఆకట్టుకుంటుండగా.. చిత్రీకరణలు జోరుగా సాగుతున్నాయి.

పెరిగిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం

మారిన కాలానుకనుగుణంగా టెక్నాలజీ కూడా అందుబాటులోకి రావడంతో యువత సద్వినియోగం చేసుకుంటున్నారు. చిత్రీకరణకు స్మార్ట్ ఫోన్‌లు, కెమెరాలు ఉపయోగిస్తూ అద్భుతంగా పాటలను చిత్రీకరిస్తున్నారు. జానపద పాటలు, సినీ గేయాలను చిత్రీకరిస్తూ ఫేస్ బుక్, ఇన్‌స్టా గ్రామ్, యూట్యూబ్ లాంటి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. కాస్త కంటెంట్, కొంచెం కామెడీ ఉంటే వీడియోలకు లైక్స్, వ్యూస్‌తో డబ్బులను సంపాదిస్తున్నారు. ఇప్పుడు యువతరం అంతా రీల్స్, యూట్యూబ్, ఇన్‌స్టాగామ్ ఫేస్‌బుక్ లాంటి సోషల్ మీడియాలోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు. అలాంటి సోషల్ మీడియా వినియోగం పెరిగిన తర్వాత స్మార్ట్ ఫోన్లు వాడుతూ అనేక మంది యువకులు, యువతులు రీల్స్ చేయడం, పాటలు పాడటం, డైలాగ్స్ చెప్పడం, డాన్స్‌లు చేయడం వంటివి పెరిగిపోయాయి. ప్రస్తుతం యువత షూటింగ్‌లపై దృష్టిసారించి రాణిస్తున్నారు.

పల్లెల్లో షూటింగ్ సంతోషంగా ఉంది



గ్రామీణ ప్రాంతాల్లో జానపద, సినీ గేయాలను చిత్రీకరించడం చాలా సంతోషంగా ఉంది. పల్లె అందాలు, పచ్చని పంట పొలాలు, చెరువులు, గుట్టలు కూడా ఇక్కడ చూడముచ్చటగా ఉన్నాయి. ఇక్కడ వాతావరణం, ప్రకృతి చాలా రమణీయంగా ఉండడంతో పాటల చిత్రీకరణకు ఖర్చు కూడా తక్కువగానే అవుతుంది. ఈ ప్రాంతాల్లో ప్రకృతి అందాలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో మరిన్ని షూటింగ్‌లు చిత్రీకరించవచ్చు.

– పెద్ది నారాయణ, సంగీత కళాకారుడు, రచయిత, నిర్మాత

సంక్షిప్తంగా

చెట్లు తొలగించినవారిపై చర్య తీసుకోవాలి


నేలమట్టమైన ఈత చెట్లు

కమలాపూర్ : మండలంలోని గూనిపర్తిలో ఈత చెట్లు తొలగించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గీత కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. గూనిపర్తి శివారులోని మాటుకాల్వ శుభ్రం చేసే పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కాల్వకు ఇరువైపులా ఉన్న వందలాది ఈత చెట్లను నరికేసి నేలమట్టం చేశాడని ఆరోపించారు. దీంతో ఈత చెట్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు జీవనోపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈత చెట్లను నరికేసి తమకు జీవనోపాధి లేకుండా చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించకపోతే ఆందోళన చేపడుతామని గీత కార్మికులు హెచ్చరించారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

ఎల్కతుర్తి : మండలంలోని దామెర గ్రామంలో అల్లెపు రాజు తన కిరాణంలో గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నాడే సమాచారం మేరకు బుధవారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సుమారు రూ.2,275 విలువచేసే గుట్కా ప్యాకెట్లు లభించినట్లు ఎస్సై పేర్కొన్నారు. రాజును విచారించగా తాను కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మెట్టుపల్లి గ్రామానికి చెందిన మాడ శ్రీనివాస్ వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా మనోజ్


నమిండ్ల మనోజ్

హసన్‌పర్తి : పరకాల యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా హసన్‌పర్తి మండలం కోమటిపల్లికి చెందిన నమిండ్ల మనోజ్ నియమితులయ్యారు. ఈమేరకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డిని మనోజ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి పనులకు దరఖాస్తు చేసుకోవాలి

ఐనవోలు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సన్న, చిన్నకారు రైతులకు వ్యవసాయ అనుబంధమైన వ్యక్తిగత పనులు ప్రభుత్వ నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ నక్క కుమారస్వామి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. పండ్ల తోటల పెంపకం పథకంలో భాగంగా మామిడి, నిమ్మ, బత్తాయి, జీడీ మామిడి, జామ, సీతాఫలం, సపోటా, ఆయిల్ పామ్, అల్లనేరడి, ఆపిల్‌బేర్, దానిమ్మ, మునగ, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్ వంటి తోటల పెంపకంతో పాటు గట్లపై అల్లనేరడి, కొబ్బరి, సీతాఫలం, జామ, కరోడా వంటి పండ్ల మొక్కలు పెంచుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఉపాధి కూలీలతో గుంతలు తీయించడం, ప్రభుత్వ నిబంధనల ప్రకారం మొక్కల ఖర్చు చెల్లించడం, అంతర పంటల నిర్వహణ, ఎరువులు, నీటి నిర్వహణ ఖర్చులు చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారు. అదే విధంగా పశువుల పాక, కోళ్ల, మేకల, గొర్ల షెడ్లు నిర్మాణం, అజోలా, ఎరువు గుంతలు, వ్యక్తిగత ఇంకుడు గుంతలు, బయోగ్యాస్ ప్లాంట్‌లకు కూడా ఉపాధి హామీ పథకంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల రైతులు ఈనెల 20వ తేదీలోపు సంబంధిత గ్రామపంచాయతీ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇందుకుగాను రైతులు కొన్ని ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని వివరాల కోసం సంబంధిత ఉపాధి అధికారులను సంప్రదించాలని కోరారు.

పశువుల పాకల నిర్మాణానికి..

కమలాపూర్ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పశువుల పాకలు, కోళ్ల షెడ్లు, గొర్రెల, మేకల షెడ్లు, అజోలా గుంతలు, ఎరువుల గుంతలు, వ్యక్తిగత ఇంకుడు గుంతలు, బయోగ్యాస్ ప్లాంట్ వంటి నిర్మాణానికి రైతులు, ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగిన వారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ గుండె బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సన్న, చిన్నకారు రైతులు తమ ధ్రువీకరణ పత్రాలు, నిర్మాణం చేపట్టినట్లు స్థల ధృవీకరణ పత్రం, ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు, పశు వైద్యాధికారిచే పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలు పెంపకం చేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రాలు, గ్రామపంచాయతీ తీర్మానంతో గ్రామపంచాయతీ కార్యాలయంలో లేదా మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని ఎంపీడీఓ కోరారు.

హక్కులకు పోరాడిన బుర్ర రాములు


కేయూ ఎస్‌డీఎల్‌సీఈ ప్రాంగణంలో రాములుకు నివాళులర్పిస్తున్న రాంబ్రహ్మం, తదితరులు


మొదటి గేట్ వద్ద బుర్ర రాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జీవన్, తదితరులు

కేయూ క్యాంపస్: మానవ హక్కుల కోసం నిరంతరం పోరాడిన కేయూ ప్రొఫెసర్ దివంగత బుర్ర రాములు ఆశయాల సాధనకు కృషి చేయాలని భారత్ బచావో హనుమకొండ జిల్లా చైర్మన్ రాంబ్రహ్మం అన్నారు. పీడీఎస్‌యూ (ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం) ఆధ్వర్యంలో కేయూ ఎస్‌డీఎల్‌సీఈ ప్రాంగణంలో ప్రొఫెసర్ దివంగత బుర్ర రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, దూర విద్యాకేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సురేష్‌లాల్, డాక్టర్ జగన్, సామాజిక విశ్లేషకులు శోభ, రమేష్, డీఎస్‌పీ కన్వీనర్ కామగోని శ్రావణ్, ఏఐడీఎఫ్‌ఓ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు స్టాలిన్, భారత్ బచావో నాయకులు వెంగల్‌రెడ్డి, ఓంబ్రహ్మం, రాజ్‌మహ్మద్ పాల్గొన్నారు.

బుర్ర రాములు ఆశయాలు కొనసాగిద్దాం

మానవహక్కుల ఉద్యమ నేత దివంగత బుర్ర రాములు ఆశయాలను కొనసాగిద్దామని వరంగల్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు తీగల జీవన్ అన్నారు. పీడీఎస్‌యూ, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత జిల్లా కమిటీల ఆధ్వర్యంలో బుర్ర రాములు 14వ యాదిసభను కేయూ మొదటి గేట్ వద్ద బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుర్ర రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తీగల జీవన్ మాట్లాడుతూ బుర్ర రాములు తన జీవితాన్ని మానవ, పౌర హక్కుల కోసం త్యాగం చేశారని కొనియాడారు. టీపీటీఎఫ్ నాయకుడు బైరి స్వామి, సీపీఐ న్యూడెమొక్రసీ నాయకుడు నున్న అప్పారావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్‌కుమార్, స్కాలర్ ఆదాసి రమేష్, జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, బాధ్యులు ముషారఫ్, గణేష్, నాని, శంకర్, శేఖర్, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

లీడర్‌షిప్ క్యాంపునకు ఎంపిక


మోహన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు


ఎన్‌సీసీ కేడెట్లను అభినందించిన వైస్ ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ ఆఫీసర్

రామన్నపేట: ఎన్‌సీసీ ఆర్మీ పదో తెలంగాణ బెటాలియన్ తరఫున నగరంలోని ఎల్‌బీ కళాశాలకు చెందిన బానోత్ మోహన్ ఈనెల 14 నుంచి 25వ తేదీ వరకు నిజామాబాద్ ఎన్‌సీసీ గ్రూప్ ఆధ్వర్యంలో కరీంనగర్ సింగపూర్ టౌన్‌లోని కిడ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఆల్ ఇండియా లీడర్ షిప్ క్యాంపునకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్‌రావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టర్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్యాంపులో ఎల్‌బీ కళాశాల ఆర్మీ విభాగం నుంచి బానోత్ మోహన్ పాల్గొనడం అరుదైన అవకాశమని అన్నారు. ఈమేరకు ఆయనను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు. కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ భాగ్యనారాయణ, సెక్రటరీ వినయ్‌కుమార్, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.సదానందం పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల కేడెట్లు..

కేయూ క్యాంపస్: హుజూరాబాద్‌లోని కిట్స్ కళాశాలలో ఈనెల 14నుంచి పదిరోజుల పాటు నిర్వహించనున్న అడ్వాన్స్ లీడర్‌షిప్ క్యాంపునకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు సీనియర్ అండర్ ఆఫీసర్ కె.నివేదిక, భానురేఖ, ఎండీ.బాబా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ ఎస్.స్వామి బుధవారం అభినందించారు.

పార్టీ బలోపేతానికి కష్టపడిన వారికి గుర్తింపు

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అగ్రంపహాడ్‌లో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ఆత్మకూరు, దామెర మండలాల సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, టీపీసీసీ అబ్జర్వర్ అహ్మద్‌తో కలిసి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేసిన కార్యకర్తల కష్టాన్ని మర్చిపోనని, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. అంకితభావంతో పనిచేస్తే కార్యకర్తలు, నాయకులకు తగిన స్థానం కల్పిస్తానన్నారు. సమర్థ నాయకత్వంలోనే పార్టీ బలోపేతం అవుతుందన్నారు. కార్యకర్తలు, నాయకులు ఎక్కడా కూడా గ్రూపు విభేదాలకు తావు తావ్వకుండా పనిచేయాలన్నారు. రానున్న రోజుల్లో కష్టపడిన వారికి పదవులు దక్కుతాయన్నారు. అనంతరం టీపీసీసీ అబ్జర్వర్ మక్సూద్ అహ్మద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనుల సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, సొసైటీ చైర్మన్ రవీందర్‌గౌడ్, నాయకులు రాజు, రజనీకాంత్, సందీప్, కృష్ణ పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

దామెర : మండలంలోని ఊరుగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఆలయంలో జీర్ణోద్ధారణ సహిత శిఖర కలశ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా బుధవారం చివరి రోజు పంచలోహ సుదర్శన శిఖర కలశాన్ని వైభవంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు తూపురాణి శ్రీనివాసచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రత్నన్యాసం, ధాతున్యాసం, బీజన్యాసం తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. ఆయన వెంట జిల్లా నాయకులు శ్రీధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, రవి, రామకృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజు, రామ్‌చందర్ పాల్గొన్నారు.

సకాలంలో విత్తనాలు నాటాలి


ఐనవోలు : మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి


వేలేరు : మాట్లాడుతున్న శాస్త్రవేత్త వీరన్న

ఐనవోలు : రైతులు భూమి పదను ఉన్నప్పుడే అదను చూసుకుని విత్తనాలు విత్తుకోవాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వెంకట్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన హాజరైన మాట్లాడుతూ.. విత్తనాలు మొలకెత్తడానికి సరిపడ వర్షం కురువకముందే రైతులు తొందరపడి పత్తి విత్తనాలు విత్తుకుని నష్టపోతున్నారన్నారు. గ్రామాల్లో పలు కారణాలతో చెట్లు నరికడంతో పర్యావరణంలో మార్పులు వచ్చి సరైన సమయంలో వర్షాలు కురవడం లేదన్నారు. గ్రామాల్లో కూడా చెట్లు పెంచాలని చెప్పే రోజులు వచ్చాయన్నారు. రానున్న రోజుల్లో అధిక ఆక్సిజన్‌ను ఇచ్చే చెట్ల పెంపకం కోసం రైతులు, కార్పొరేట్ సంస్థలతో ఎంఓయూ కుదుర్చుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. అందుబాటులో ఉన్న వరి, పెసరా, కందుల విత్తన రకాల గురించి రైతులకు వివరించారు. పంట మార్పిడి గురించి, సస్యరక్షణ చర్యల గురించి చెప్పారు. జనుము, జీలుగ పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యత గురించి చెప్పారు. బలంలేని భూముల్లో అధిక సాంద్రతలో మొక్కలు నాటుకోవాలని సూచించారు. మేలు చేసే శిలీంద్రాల కోసం మన ప్రాంత భూముల్లో సూడో మోనాస్ అద్భుతంగా పనిచేస్తుందన్నారు. సూక్ష్మ జీవశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.మానస మాట్లాడుతూ.. జీవన ఎరువుల ప్రాముఖ్యత గురించి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రైతుల గుర్తింపు కోసం విశిష్ట గుర్తింపు సంఖ్యను అందిస్తుందని, అందుకోసం రైతులు ఆధార్, పట్టాపాసుబుక్ జిరాక్స్, ఆధార్‌తో లింకైన మొబైల్ నంబర్‌తో వ్యవసాయ అధికారులను సంప్రదించాలని ఏఓ సునీల్ కుమార్ కోరారు. ఏఈఓ హీనా కౌసర్, ఇల్లంద మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమూద్, మాజీ సర్పంచ్ కంజర్ల రమేశ్, తాడెం మోహన్ పాల్గొన్నారు.

వేలేరు : రైతులు అవసరం మేరకే రసాయనాలను వినియోగించాలని శాస్త్రవేత డాక్టర్ వీరన్న అన్నారు. పీచర గ్రామంలో బుధవారం రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. సిఫారసు మేరకు మాత్రమే పొటాషియం, యూరియా వాడాలని, పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని అన్నారు. ఏఓ కవిత, ఏఈఓ విజయ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నివారణపై అవగాహన


కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డీహెచ్‌ఈఓ శ్రీనివాస్

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని కొత్తపల్లి, భీమదేవరపల్లి, వంగర గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ప్రజలకు కుష్ఠు వ్యాధి నివారణపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. జిల్లాస్థాయి నిపుణుల బృందం గ్రామాలను సందర్శించి, ప్రజలకు కుష్ఠువ్యాధి గురించి అవగాహన కల్పించారు. గత నెల ఏప్రిల్‌లో ఆశ వర్కర్లతో నిర్వహించిన సర్వేలో ఎవరైతే ఎర్ర, తెల్ల, స్పర్శ లేని మచ్చలు ఉన్న అనుమానిత వ్యక్తులను పరీక్షించి, అవసరమైన వైద్యం అందించినట్లు జిల్లా ఆరోగ్య వైద్యధికారి (డీహెచ్‌ఈఓ) శ్రీనివాస్ తెలిపారు. అలాగే ఎండలు అధికంగా ఉన్న సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యులు డాక్టర్ రహమాన్, డాక్టర్ రుబీనా, సూపర్‌వైజర్ మోహన్, తదితర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ట్రాక్టర్ డ్రైవర్ మృతి

పరకాల : ట్రాక్టర్‌తో మొరం తరలిస్తుండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన పరకాల మండలం కామారెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. పరకాల సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సీపతి భద్రయ్య అదే గ్రామానికి చెందిన ఎక్కటి సమ్మిరెడ్డి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అర్ధరాత్రి సమయంలో పెద్దకోడెపాక వద్ద నిర్మాణ దశలో ఉన్న సూర్యదేవర శ్రీనివాస్ రైస్‌మిల్‌కు మొరం తరలిస్తుండగా ట్రాక్టర్ టైర్ బండరాయి పైకి ఎక్కడంతో డ్రైవర్ భద్రయ్య సీటుపై నుంచి కిందపడ్డాడు. దీంతో ఆయనకు తీవ్రగాయాలు కాగా తోటి డ్రైవర్‌లు హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ డ్రైవర్ భద్రయ్య మంగళవారం సాయంత్రం మృతిచెందినట్లు సీఐ తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

ఖిలా వరంగల్: ఓ ఇంట్లో ఏర్పాటు చేసిన పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి రూ.20,820 నగదుతోపాటు నాలుగు సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లు, ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకుని, ఐదుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ కరీమాబాద్ రోడ్డు ఎస్ఆర్ఆర్ తోటలోని నాగటి సునీల్ ఇంట్లో పేకాట స్థావరంపై దాడి చేసి కొండపర్తి గ్రామానికి చెందిన రాయపర్తి రమేష్, కరీమాబాద్‌కు చెందిన కొవాకుల రాజేష్, కరీమాబాద్ చెందిన కొవాకుల శివ పట్టుబడగా, దుగ్గొండి మండలం బండ గ్రామానికి చెందిన పల్లకొండ రమేష్, ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన నాగటి సునీల్ పరారీలో ఉన్నట్లు సీఐ వివరించారు.

వైభవంగా అష్టోత్తర శత ఘటాభిషేకం



హన్మకొండ అర్బన్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమత్‌గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో రెండో రోజు బుధవారం ఉదయం గణపతి పూజ, నవగ్రహ మాన్య సూక్తహవనం నిర్వహించిన అనంతరం 108 కలశాలతో అష్టోత్తర శత ఘటాభిషేకం జరిపించినట్లు ఆలయ అర్చకుడు ఆరుట్ల రామాచార్యులు తెలిపారు. మధ్యాహ్నం భజన కార్యక్రమం, మాలధారులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో హనుమాన్ దీక్ష సేవ సమితి అధ్యక్షుడు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కసుకుంట్ల రవికుమార్, సభ్యులు దశరథ్‌కుమార్, మాదాసు మొగులయ్య, గంద్రతి సుధాకర్, గంట సత్యం, సీతా సమ్మయ్య, శంకర్ పాల్గొన్నారు.